తెలుగుదేశం పార్టీ
రాష్ట్ర పార్టీ కార్యాలయం

ఎన్.టి.ఆర్. భవన్
రోడ్‌నెం.2, బంజారా హిల్స్
హైదరాబాద్ - 34

తేది : 22-09-2016

పత్రికా ప్రకటన

# దోపిడీ బయట పడుతుందనే డీపీఆర్‌లు ఇవ్వడం లేదు!

**- పాలమూరు ప్రాజెక్టులన్నీ గత పాలకులు ఇచ్చినవే**

**- వచ్చిన ప్రాజెక్టులను ఆపడమే మీరు చేసింది**

**- కేసీఆర్, హరీశ్‌లపై ధ్వజమెత్తిన రేవంత్**

హైదరాబాద్, సెప్టెంబర్ 22: తాము చేస్తున్న దోపిడీ బయటి ప్రపంచానికి తెలుస్తుందన్న ఉద్ధేశంతోనే కేసీఆర్, హరీశ్‌రావులు కృష్ణా నదిజలాల నిర్వహణ బోర్డుకు పాలమూరు, డిండి ప్రాజెక్టుల డీపీఆర్‌లు ఇవ్వడం లేదని తెలుగుదేశం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. నీటి లభ్యత లేకుండా కమీషన్లకు కక్కుర్తిపడి అడ్డగోలుగా ప్రాజెక్టులు నిర్మిస్తే ఎవరూ ఊరుకోరని ఆయన హెచ్చరించారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేవంత్ మాట్లాడారు. ఢిల్లీలో ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో జరిగిన అపెక్స్ కమిటీ సమావేశాన్ని స్వాగతిస్తున్నామని, కొన్ని అంశాలపైనైనా ఏకాభిప్రాయం కుదరడం శుభపరిణామమని పేర్కొన్నారు. అయితే, పాలమూరుకు చెందిన పాలమూరు-రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులను చంద్రబాబు నాయుడు వ్యతిరేకించారంటూ కేసీఆర్ వందిమాగదులు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. అయితే, తాను ఆప్రాజెక్టులను వ్యతిరేకించలేదని కేవలం వివరణ కోరామని చంద్రబాబు చెప్పినట్లు టీఆర్ఎస్‌కు చెందిన 'గుమస్తా తెలంగాణ' పత్రికలో వచ్చిందన్నారు. చంద్రబాబును విమర్శిస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి, గువ్వల బాలరాజు ముందుగా ఆ పత్రికను చదువుకోవాలని కోరారు. లక్ష్మారెడ్డిని మున్నాభాయ్ ఎంబిబిఎస్, గువ్వల బాలరాజుని గబ్బిలాల బాలరాజుఅని రేవంత్ ఎద్దేవా చేశారు. డిండి ప్రాజెక్టుకు రూ.6000 కోట్లతోనూ, పాలమూరు ప్రాజెక్టుకు రూ.35వేల కోట్లతోనూ టెండర్లను పిలిచారని, అయితే, ఆ ప్రాజెక్టులకు సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) లేకుండానే టెండర్ల పిలవవచ్చా? అని ప్రశ్నించారు. కృష్ణా నది జలాల నిర్వమణ బోర్డుకు ఈ ప్రాజెక్టలకు సంబంధించిన డీపీఆర్‌లను ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. డీపీఆర్లు ఇస్తే వాటి ద్వారా మీరు చెస్తున్న దోపిడీ, మీ

బతుకు బయట పడుతుందని భయపడ్డారా? లేకపోతే అసలు డీపీఆర్లే లేవా? అని ఆయన సీయం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులను ఉద్దేశించి ప్రశ్నించారు. కృష్ణా జలాలను ఇది వరకే ఉభయ రాష్ట్రాలు పంచుకున్నాయని, ఢిల్లీలో గతంలో జరిగిన సమావేశంలో ఏపీ 512 టీయంసీలు, తెలంగాణ 299 టీయంసీలు పంచుకునే విధంగా ఒప్పందం జరిగిందని దీనికి ఇరు రాష్ట్రాల మంత్రులు, అధికారులు ఒప్పుకుంటూ సంతకాలు చేశారని రేవంత్ గుర్తు చేశారు. తెలంగాణకు హక్కు ఉన్న 299 టీయంసీలను వినియోగించుకోవడానికి ఎన్ని ప్రాజెక్టులు కడతారో తెల్చిచెప్పాలని గతంలో ప్రొఫెసర్ కోదండరాం కూడా ప్రశ్నించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. 299 టీయంసీలపై ఉన్న ప్రాజెక్టులు ఎన్ని? నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు ఎన్ని ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులు ఎన్ని? అనే అంశాలను, ఆయా ప్రాజెక్టులకు ఉన్న నీటి లభ్యత వివరాలను తేల్చిచెప్పాలని కోరారు. నీటి లభ్యత లేకపోయిన అడ్డగోలుగా ప్రాజెక్టులను నిర్మించి కమీషన్లు దండుకోవాలని చూస్తే ఊరుకోమని ఆయన హెచ్చరించారు. పాలమూరు జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణానికి ఇప్పటి వరకు ఖర్చుచేసిన రూ.8400 కోట్లలో టీఆర్ఎస్ పెట్టింది కేవలం రూ.380 కోట్లు మాత్రమేనని దీనికి సంబంధించిన లెక్కలను చూపించడానికి ఎప్పుడైనా తాము సిద్దమేనని పేర్కొన్నారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాలని ఇరు రాష్ట్రాలు స్నేహపూరిత వాతావరణంలో అభివృద్ధి చెందాలని చంద్రబాబు నాయుడు ఆదినుంచి కోరుతున్నారని అయితే, టీఆర్ఎస్ మాత్రం ఇరు రాష్ట్రాల ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనం పొందాలని ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. కృష్ణా నదిపై నిర్మిస్తున్న ప్రాజెక్టులకు నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోక పోగా, ఆంధ్ర కాంట్రాక్టర్ల ఒత్తిడితో టెండర్లు పిలిచి దోపిడీకి తెరతీశారని ఆరోపించారు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన ఎన్‌టెక్‌వెల్‌ను ఎక్కడ నిర్మించాలనే విషయం ఇప్పటికి నిర్ణయించలేదని ఎక్కడ నుంచి లిఫ్ట్ చేస్తారనే విషయం నిర్ణయించకుండానే కాలువలను తవ్వుతున్నారని ప్రాజెక్టుల్లో అవినీతికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. తమ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే మామా, అల్లుళ్లు టీడీపీపై అభాండాలు వేస్తున్నారని విమర్శించారు.

**మీరు చేసిందేమిటో చెప్పండి?**

మహబూబ్‌నగర్ జిల్లాలో రూపుదిద్దుకున్న కల్వకుర్తి,నెట్టంపాడు, భీమా, సంగంబండ ప్రాజెక్టులను గతంలో చంద్రబాబు నాయుడు మంజూరు చేశారని, డిండి ప్రాజెక్టును రోశయ్య

మంజూరు చేశారని, పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని కిరణ్‌కుమార్‌రెడ్డి మంజూరు చేశారని కేసీఆర్, హరీష్‌రావులే చెబుతున్నారని రేవంత్ గుర్తుచేశారు. అన్ని ప్రాజెక్టులను గతంలో ఉన్న ముఖ్యమంత్రులే మంజూరు చేస్తే ఇక మీరు చేసింది ఏమిటని ఆయన నిలదీశారు. రోశయ్య హయాంలో మహబూబ్‌నగర్ జిల్లాకు మంజూరైన కొడంగల్-నారాయణపేట ప్రాజెక్టును తొక్కిపెట్టడం, 90% పూర్తి అయిన పాలమూరు ప్రాజెక్టులను పడకేయించడం మాత్రమే కేసీఆర్ ప్రభుత్వం చేసిందని ఆయన ధ్వజమెత్తారు. కేసీఆర్ చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణంలో అవినీతి, అవకతవకులు లేకపోతే ఆ ప్రాజెక్టుల డీపీఆర్‌లను కృష్ణాబోర్డుకు ఇవ్వడానికి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు.

**హరీశ్ మిడిసిపడొద్దు**

కాగా, అపెక్స్‌కమిటీ సమావేశంలో మంత్రి హరీశ్‌రావు చంద్రబాబు నాయుడును నిలదీశారని, ఆయనపై గట్టిగా వాగ్వివాదానికి దిగారని టీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారంలో ఎంత మాత్రం వాస్తవం లేదని రేవంత్ స్పష్టం చేశారు. మంత్రి హోదాలో అపెక్స్ కమిటీ సమావేశానికి హాజరైన హరీశ్‌రావు ఇష్టానుసారంగా ఆ సమావేశంలో మాట్లాడే అవకాశం ఏ మాత్రం ఉండదని చెప్పారు. అయితే, హరీశ్‌రావు చంద్రబాబుపై ఆగ్రహిస్తే కేసీఆర్ ఆయనను సమాధాన పర్చాంటూ వచ్చిన వార్తలను కేసీఆర్ హరీశ్‌రావుల నాటకమని ఆయన అభివర్ణించారు. "హరీశ్‌రావు మీకు మిడిసిపాటు తగదు... నోటికొచ్చినట్లు మాట్లాడడానికి ఆయన మీ మామ కాదు... నారా చంద్రబాబు నాయుడు అని గుర్తించుకో..." అని రేవంత్ హెచ్చరించారు. ప్రతి విషయానికి టీడీపీపై పడి ఏడ్వకుండా నిజంగా తెలంగాణ అభివృద్ధిని కోరుకుంటే పాలమూరు, డిండి ప్రాజెక్టుల డీపీఆర్‌లను బయట పెట్టాలని ఆయన కోరారు. ఈ విలేకరుల సమావేశంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షులు బొట్ల శ్రీనివాసులు కూడా పాల్గొన్నారు.

( ఎ.రేవంత్‌రెడ్డి)
వర్కింగ్ ప్రెసిడెంట్
తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్రం